
# బ్రతికేయు



రెంటాల హనుమత్ ప్రసాద్

చాల రోజుల తరువాత కాంతారావు ఇంటి వైపు నా కాళ్ళు నడిచాయి. కాంతారావును నేను కలిసి దాదాపు మూణ్ణెల్లు కావస్తుంది. ఈ మధ్యవాడిని గురించి నాకేమీ తెలియదు. అందుకే బయలుదేరాను. మూణ్ణెల్ల క్రితం వాడిని కలిసినప్పుడు వాడి ఉద్యోగం వూడిందన్న సంగతి తెలిసింది. అన్యాయంగా ఆర్జించటం మొదలు పెడితే ఉద్యోగం వూడక ఛస్తుందా. కాంతారావు మాత్రం ఏం చెయ్యగలడు పాపం, వాడి సంసారం పెద్దదాయె ఉద్యోగం వూడటంతో వొడ్డున పడిన చేపలా తయారయింది వాడి పరిస్థితి. ఈ మధ్య కాలంలో నేను ఊళ్ళో లేక పోవడంతో వాడి అజా లేకపోయింది.

ఒక అరగంట నడిచిన తరువాత కాంతారావు ఇల్లు వచ్చింది. నేను అక్కడికి చేరుకునేటప్పటికి వాడి ఇంటి ముందు ఒక అర డజను మంది స్త్రీలు మరో అరడజను మంది పిల్లలు, వాళ్ళతో పాటు పది మంది మగవాళ్ళు అంతా చేరివున్నారు. నా మనసెందుకో కీడు శంకించింది. గాబరాగా లోనికి ప్రవేశించాను. కాంతారావు ఇల్లు పెద్ద లోగిలి మండువాలో అరుగు మీద కాంతారావు కనబడ్డాడు. చూడంగానే గుర్తుపట్టలేదు సుమా ఒక్క క్షణం పరిశీలించిన తరువాతనే ఈవెధవ కాంతారావే అనుకున్నాను. వాడి ఆకారం పూర్వంలా లేదు. గడ్డం పెంచేశాడు. వాటితో పాటే మీసాలు కూడా పెరిగాయి. నుదుట ఎర్రటి కుంకుడు గింజంత బొట్టు అడ్డ నామాలు పట్టుదోవతి కట్టి చాపమీద కూర్చుని వున్నాడు. ఒంటి మీద చొక్కా బనీను లేవు. ఒక చిన్న సాధువులా వున్నాడు. నన్ను చూడంగానే నవ్వాడు దగ్గరికి రమ్మన్నట్లు సైగ చెయ్యడంతో వాడి ప్రక్కకు వెళ్ళి నిలబడ్డాను. "హరి ఓం" అంటూ కనులు మూసుకుని వెంటనే తెరిచేశాడు. మొల్లోవున్న చిన్న సంచిలో నుండి తాయిత్తు ఒకటి బయటకు తీశాడు. ప్రక్కనే వున్న

ముసలతని చంకలోని పిల్లవాడి (మనవడు కాబోలు) మొలకుచుట్టి నా వంక చూసి నవ్వాడు.

"బాబూ ఎన్ని రోజుల్లో నయమవుతుంది" ఆముసలతను అడిగాడు.

"ఇక మీ అబ్బాయికేం పర్వాలేదు తాత గారూ! అబ్బాయి ఎందుకోదడుచుకున్నాడు. దాని తాలూకుజ్వరమే ఇది.నాలుగు రోజుల్లో శుభ్రంగా స్కూలుకు వెళ్ళి వస్తాడు. మీరేమీ గాబరా పడనక్కరలేదు. వెళ్ళిరండి" గడ్డం నిమురుకుంటూ చెప్పేడు.

"వస్తాను బాబూ" అవృద్ధుడు కాంతా రావు దగ్గర సెలవు తీసుకున్నాడు.

"హల్లో బ్రదర్ ! ఊరు నుండి ఎప్పుడు వచ్చేవ్" నవ్వుతూ అడిగాడు.

"రాత్రివచ్చానులే...నీ ఈవేషమేమిటి. ఆ ముసలతని పిల్లవాడికి తాయిత్తు నీవు కట్టడమేమిటి. బయట నిలబడ్డవారందరూ ఎవరూ ?" ఆశ్చర్యంగా అడిగాను.

చిన్నగా ఓ మారు నవ్వాడు. తర్వాత చెబుతాను, ఒక అరగంట వెయిట్ చెయ్యి. వాళ్ళను పంపి వస్తాను అంటూ "అన సూయా" ఒక చిన్న కేక పెట్టి పిలిచాడు పెళ్ళాన్ని.

"వస్తున్నానండీ" అంటూ బయిటకు వచ్చింది. నన్ను చూడంగానే చిన్నగా నవ్వి సాదరంగా ఆహ్వానించింది. "లోపలికి రండి అన్నయ్యగారూ" అంటూ.

"ఒరేయ్ కాఫీ త్రాగి మీ చెల్లాయితో హస్కుకొడుతూ వుండు." అని చెప్పి ఎదురుగా వున్న వారివంక చూస్తూ చెయ్యి వూపాడు. ఎవరో స్త్రీ పిల్లవాణ్ణి చంకన బెట్టుకుని ముందస్తుగా వచ్చింది.

"మీరు రండి అన్నయ్యగారూ" అన్న అనసూయ మాటలకు ఇంట్లోకి ప్రవేశించాను.

అరగంట తరవాత —

కాంతారావుతో రోడ్డుమీద నడుస్తున్నాను.

"ఐతే బ్రతుకు తెరువుకోసం ఈనాటక మాడుతున్నావన్న మాట" నవ్వుతూ అన్నాను.

"మరేం చెయ్యమంటావ్ భాయ్ ! ఉద్యోగమా వూడింది. తిందామంటే ఆస్తిపాస్తులు లేవు. సంసారమా పెద్దది. అందుకనే మూణ్ణెల్లు మాయమయ్యాను. ఓరోజు హఠాత్తుగా ఇంటికి వచ్చి పడ్డాను గడ్డాలు మీసాలతో. ఇంట్లో వాళ్ళంతా వుక్కిరిబిక్కిరి అయ్యారు సంతోషంతో. అసలు దేశాలు పట్టుకుపోయానేమో అనుకున్నారట అంతా. కాని నేనేమో వెంటతీసుకు వెళ్ళిన మూడు వేలు మద్రాసు రేసుల్లో తగలబెడుతూ వుండి పోయానాయె. పుణ్యక్షేత్రాలు దర్శించి వచ్చానని చెప్పాను. రామేశ్వరంలో ఓ సాధువు నన్ను పిలిచి ఓ మంత్రం ఉపదేశించాడనీ దాని ద్వారా ఎలాటి రోగాలనైనా ...పిచ్చి, దయ్యాలు వగైరా వగైరా సర్వరోగ నివారిణి అనవచ్చుననీ వాటితో తగ్గించగలనవీ వూక దంపుడు దంచేసి ఈ అవతారం ఎత్తాను. తెలిసిన వారందరికి టామ్ టామ్ చేశాను.

ముందు ఓ పదిమందికివుచితంగా తాయిత్తులు కట్టాను. తగ్గిన వారికి తగ్గింది. లేని వారికి లేదు. వచ్చిన తరువాత రోగం అనేది తగ్గక ఛస్తుందా. నా తాయిత్తునే నమ్ముకుని ఏమీ వుండరుకదా, ఏదో మందో మాకో వాడతారు, దాని ద్వారా రోగం తగ్గుతుంది. తాయిత్తు మహిమేననుకునే వాళ్ళుమన ప్రజలలో ఎక్కువ శాతం వున్నారు. వారానికి రెండురోజులు గురువారం ఆదివారం మాత్రమే తాయిత్తు కడతాను. మిగతా రోజుల్లో కట్టను, ఆరోజులు మాత్రం ఉపోషం వుంటాను, మిగతా రోజుల్లో వచ్చే ఆర్డర్లను బట్టి ఆరెండు రోజులు వరుస క్రమంలో తాయిత్తులు కడుతుంటాను. ఒక్కొక్క తాయిత్తుకు రెండు రూపాయలు ఛార్జిచేస్తాను, అంతవరకే మా గురువుగారుతీసుకోమన్నా రని కూడా కోస్తాను.'' చెప్పేది ఆపి నావంక చూసి నవ్వాడు కాంతారావు.

"వారానికి రెండురోజులేతాయిత్తులు కట్టడమేమిటి...పైగా ఉపోషం కూడానా..." అన్నాను ఆశ్చర్యంగా.

''వ్యాట్ మాన్ ! ఆ మాత్రం తెలును కోలేవూ ప్రజలను నమ్మించాలి. వాళ్ళను నమ్మించాలంటే ఇలాంటి కండిషన్లు ఏర్ప రుచుకొనాలి. నమ్మకం బలపడుతుంది.'' ఈ మాత్రం తెలుసుకోలేవూ అన్నట్టు నావంక చూశాడు కాంతారావ్.

''ప్రజలను మోసం చేస్తున్నట్లు కదూ..''

''నీతులువద్దు. బతకటం ముఖ్యం దాని కోసంఎన్ని అడ్డదారులుతొక్కినాతప్పుకాదం టాను. నేనేం హరిశ్చంద్రుణ్ణికాదు- నీతి న్యాయం అనుకుంటే నా పెళ్ళాం బిడ్డలు మాడి ఛస్తారు. బ్రతుకుతున్నది నా కోసం ...నా పెళ్ళాం బిడ్డలకోసం ... మరొకరి కోసం కాదు. దేశమంతా మడి గట్టుకుని కూర్చుని వుంటే నేనూ మడిగట్టుకునే వాణ్ణే. ఊర్లు ఊర్లు దోచే వాళ్ళని వదిలి దారిని దోచే వాడి పొట్టగొట్టినట్లు నామీదకు మాత్రం విరుచుకు పడకు. ఎదుటివాడు ఎలా బ్రతుకు తున్నాడూ అన్నది కాదు. వాడి ఆర్థిక పరిస్థితి ఎలావుంది. వాడిపెళ్ళాం బిడ్డలు సుఖపడుతున్నారా లేదా...అన్నది చూస్తారు. వాడు ఎలా సంపాదిస్తున్నదీ ఎవడికీ అక్కర లేదు. ఎలా సంపాదించినా సంపాదించట మనేది ముఖ్యం...చూడు బ్రదర్ ! బ్రతకట మనేది ముఖ్య మనుకుంటే నాలాదొంగ సాధువులానో మరో బాబాలానో బ్రతికితే పుణ్యం పురుషార్థం...''నవ్వాడు కాంతారావ్.

నేనేం అనగలను.

''బాబూ ! ధర్మం'' అంటూ వెంట బడుతున్న కుష్టుదాన్ని 'ఛీ' అంటూ ఛీత్కరించి ముందుకు నడుస్తున్న కాంతారావుతో సమానంగా అడుగులు వేయటానికి ప్రయత్నించ సాగాను. •